సత్య సాయి ట్రస్ట్‌కు రహదారి కోసం భూమిని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్ : ఎస్.కోట మండలం జీడీపాలెంలో శ్రీ సత్య సాయి ట్రస్ట్‌లో ఏర్పాటు చేయనున్న కేన్సర్ ఆసుపత్రికి రహదారి కోసం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్ భూముల్ని పరిశీలించారు. సోమవారం ఆయన జీడీపాలెంలో పర్యటించి. ఆర్.డి.ఓ కీర్తి, ఎస్.కోట తహసీల్దార్ అరుణ కుమారితో రహదారికి అవసరమగు భూముల పై చర్చించారు. ప్రభుత్వ భూమిని ఎలియనేషన్ కోసం, సత్య సాయి ట్రస్ట్ కు కేటాయించడం కోసం ప్రభుత్వానికి పంపడానికి ప్రతిపాదనలు వెంటనే తయారు చేయాలని ఆర్.డి.ఓ కు ఆదేశించారు.

కబ్జా చేసిన స్థలాలుపై దర్యాప్తు చేసి హెచ్చరిక బోర్డును పాతించాలి : సీపీఐ

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణంలో ఉన్నటువంటి పలు ప్రభుత్వ స్థలాలు ,ప్రభుత్వ చెరువులను కొంతమంది భూకబ్జాలు పాల్పడి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.శ్రీనుకు సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్‌లు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో పక్షుల బంధ. కోటి చెరువు భైరసాగరం. చీపురు బంద. కిచిడి బంద. అమ్మి గారి కోనేరు గట్టు లలో పలు ప్రభుత్వ చెరువులు ఇప్పటికే సగం పైగా కబ్జాలకు గురయ్యాయని సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటు వంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. అలాగే ప్రభుత్వ స్థలాలు ఇందిరమ్మ కాలనీ. ఐటిఐ కాలనీ. మిలట్రీ కాలనీ. లలో ప్రభుత్వ స్థలాలు తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి బరితెగించి పచ్చని వ్యవసాయ భూముల్లో వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారని. బఫర్ జోన్లలో ఇటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వ నిబంధనలు చెబుతూ ఉంటే ఇవేవీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు పట్టించు కోకుండా కొంత జిరాయితీ భూమిని కొని దానికి అనుకున్న ప్రభుత్వ భూములను తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమణలకు పాల్పడి కోట్లాది రూపాయలకు పడగలెత్తుతున్నారని అన్నారు పట్టణంలో ఉన్నటువంటి కోటి చెరువు. బైరిసాగరం పక్షుల బంధ పూర్తిగా కను మరుగయ్యే ప్రమాదం ఉందని. తక్షణమే రెవెన్యూ యంత్రాంగం పట్టణంలో ఉన్నటువంటి ప్రభుత్వ చెరువులపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ఆక్రమణ దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ చెరువులను స్థలాలను కాపాడాలని కోరారు.

వీధి విక్రయిదారులను ఆదుకోండి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : రాజాం నగర పంచాయతీ లో దళిత వర్గానికి చెందిన వీధి వ్యాపారస్తులు రాజాం శ్రీనివాస థియేటర్ రోడ్డు లో అనేక సంవత్సరాలుగా వీధి విక్రయాలు చేసుకుంటూ జీవన ఉపాధి చేసు కుంటున్న 45 మంది వీధి విక్రయ దారులను ముందస్తు నోటీసు జారీ చేయకుండా, ప్రత్యామ్నయం చూడకుండా అక్రమంగా తొలగించారు. వీరికి పునర్నియామకం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ ఏఐటీయూసీ విజయనగరం జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల వేదికలో కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మా యొక్క సమస్యపైగత నెల 5 న ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ విజయనగరం జిల్లా సమితి నుండి టౌన్ పెండింగ్ కమిటీ ఛైర్మన్ రాజాం మున్సిపల్ కమిషనర్ కి లేఖ ద్వారా, సంబంధిత పోలీసులు అధికారులకు మాట ద్వారా సమాచారం ఇవ్వడం జరిగిందని అన్నారు. స్పందన లేకపోవడమే కాకుండా సంబంధిత మున్సిపల్, పోలీస్ అధికారులు షాపింగ్ మాల్ వ్యాపారస్తులతో కుమ్మక్కయ్యారని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం మాకు వీధి విక్రయదారుల కార్డులు ఉన్నాయని చెప్పినా చదువు సంధ్య లేని వ్యాపారస్తులుపై వ్యాపార నష్టం కలిగించడమే కాకుండా దురుసుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎటువంటి స్పందన లేకపోవడంతో మా యొక్క సమస్యపై టౌన్ పెండింగ్ కమిటీ చైర్మన్ అయిన రాజాం మున్సిపల్ కమిషనర్ పై, సంబంధిత రాజాం పట్టణ పోలీస్ స్టేషన్ హౌస్ అధికారులపై లేఖ ద్వారా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. రాజాం మున్సిపల్ నగర పంచాయతీ కమిషనర్ జె. రామప్పలనాయుడు, రాజం పట్టణ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ అశోక్ కుమార్ కలిసి శ్రీనివాస థియేటర్ దారిలో ఉన్న స్కూల్ రోడ్డును ఆనుకొని అనేక సంవత్సరాలుగా వీధి విక్రయాలు చేసుకుంటూ జీవన ఉపాధి చేసుకుంటున్న 45 దళిత కుటుంబాలను అర్ధాంతరంగా జీవనోపాధి లేకుండా చేసి వారి జీవితాలను రోడ్డుపాలు చేశారన్నారు. తగు పరిశీలన చేసి జీవన ఉపాధి కోల్పోయిన 45 దళిత కుటుంబాలను ఆదుకోవాలని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మక్కా గంగారావు, జామి అప్పారావు, యదమూరు కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - నెల్లిమర్ల : ఉపాధి వేతన దారులకు వెంటనే ఉపాధి వేతనాలు చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు డిమాండ్ చేశారు. సోమవారం కొండ గుంపములు ఉపాధి వేతన దారులతో నిరసన తెలియ జేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ జనవరి నుండి నేటి వరకు ఉపాధి వ్యాతనదారులకు చిల్లంచకపోవడం వేతనాలు చెల్లించకపోవడం పట్ల వేతన దారులతో కలిసి నిరసన తెలియజేశారు. అలాగే వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉపాధి వేతన దారులకు ఒక్క పూట పనులు కనిపించాలని కోరారు. 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలిపల్లి సూరి, రామస్వామి, లక్ష్మి పాల్గొన్నారు.

త్రాగినీటి బోరు బావులకు నిధులు మంజూరు

ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ దేవి

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని జిల్లా పరిషత్ నిధులు నుండి ఐదు బోరు బావులను తవ్వించేందుకు నిధులు మంజూరు అయ్యాయని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దేవి తెలిపారు.స్థానిక జెడ్పీటీసీ శానాపతి అప్పారావు జిల్లా పరిషత్తు నిధులను మంజూరు చేయించుగా చామలాపల్లి సోంపురం సింగరాయి ఓబలయ్యపాలెం, నల్లబిల్లి గ్రామాల్లో ఒక్కొక్క బోరుబావికి రూ.1లక్ష చొప్పున నిధులు మంజూరయ్యాయి అన్నారు. ఈ మేరకు సోంపురం గ్రామంలో త్రాగునీటి బోరు తవ్వించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

వివాహానికి సహాయార్థం విరాళం

విశాలాంధ్ర - తెర్లాం : తెర్లాం మండలం కూనయవలస గ్రామం లో పుసర్లవీధికి చెందిన రమణ ముత్యాలు దంపతుల కుమార్తె వివాహ సహాయార్థం మన బొబ్బిలి ఎమ్మెల్యే కలియుగ దానకర్ణులు బేబీనాయన 10,000 రూపాయలు సహాయం అందించారు. వారికి మా కునాయవలస గ్రామం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మాజీ ఎమ్ పి పి బోడేలా. సింహాచలం విలేకర్ల తో తెలిపారు.

తీరప్రాంత ప్రజలకు సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీతో అవగాహన

సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పాయ్

విశాలాంధ్ర - భోగాపురం : తీరప్రాంత ప్రజలను అవగాహన పరిచేందుకు సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) సైకిల్ ర్యాలీ చేపడుతున్నట్లు విశాఖ పోర్టు ట్రస్టు సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్ పాయ్ వెల్లడించారు. కోలకతా రాష్ట్రంలోని బక్కలి నుండి కన్యాకుమారి వివేకానంద రాక్ మెమోరియల్ వరకు చేపడుతున్న సైకిల్ ర్యాలీ సోమవారం భోగాపురం వద్దకు చేరుకున్నట్లు చెప్పారు.భారత దేశ పశ్చిమ తీరాన ఉన్నగుజరాత్ లక్ పత్ పోర్టు నుండి అలాగే కోలకతాల నుండి సైకిల్ ర్యాలీ మార్చి 31వ తేదీకి 100 మంది సైకిలిస్టులు, 6553 కిలో మీటర్లు సైకిల్ ర్యాలీ కన్యాకుమారి చేరుకుంటుందన్నారు. సైకిల్ ర్యాలీలో 14 మంది మహిళలు పాల్గొన్నారు. సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్దేశం తీర ప్రాంత ప్రజలకు సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు భారత దేశంలోకి ప్రవేశం, ఇతర దేశాల నుండి మాదక ద్రవ్యాల రవాణా వంటి వాటిపై అప్రమత్తంగా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. తీరం సురక్షితంగా ఉండేందుకు సైకిల్ ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో అప్రమత్తంగా లేకపోవడంతో ఉగ్రవాదులు భారత్ లోకి సముద్ర మార్గం ద్వారా ప్రవేశించి పార్లమెంటు పై దాడి చేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ యూనిట్ విశాఖపట్నం పోర్ట్ అథారిటీ నుండి సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్ పాయ్ , సిఐఎస్ఎఫ్ యూనిట్ ఎన్టీపీసీ విశాఖపట్నం నుండి డిప్యూటీ కమాండెంట్ వినీత్ కుమార్ ప్రభాకర్ మరియు సైక్లిస్ట్ లు అసిస్టెంట్ కమాండెంట్లు జి. శ్రీనివాస్, శ్రీకర్ లోహియా తదితరులు పాల్గొన్నారు. భోగాపురం చేరుకున్న సైకిల్ ర్యాలీ టీంకు భోగాపురం పోలీస్ సిబ్బంది, భోగాపురం గ్రామప్రజలు పూలవర్షంతో ఘనంగా స్వాగతం పలికారు.

ఏపీసీఎన్ఎఫ్ గ్రామ సంఘాలతో డీపీఎం సమీక్ష

విశాలాంధ్ర - కొత్తవలస : కొత్తవలస మండలంలోని 13 గ్రామాల్లోగల ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్) గ్రామ సంఘాలతో సోమవారం స్థానిక వెలుగు సమాఖ్యలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డిపిఎం) ఆనందరావు సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీసీ ఎన్ఎఫ్ గ్రామాలైన సంతపాలెం, దెందేరు, గులివిందాడ, గనిశెట్టిపాలెం, చీపురువలస, గొల్లలపాలెం, చీడివలస, సుందరయ్యపేట, రామలింగపురం, దేవాడ, వీర భద్రపురం, తుమ్మికాపల్లి, ఉత్తరాపల్లి గ్రామ సంఘాల సభ్యులు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సర్వే, పీఎండిఎస్ కిట్లు శతశాతం పూర్తి చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ప్రతీ రైతును కలిసి వారి.. వారి వ్యవసాయ క్షేత్రాల్లో సాగు విస్తీర్ణం, పంట వివరాలు ముందుగా సర్వే చేయాలని, తద్వారా విత్తనాలు, ఎరువుల యాజమాన్యంపై రైతులకు తెలియజేయొచ్చని అన్నారు. ఋతుపవనాలు రాకముందు వేసే పంట (ప్రీ మాన్సూన్ డ్రై సొయింగ్) పీఎండిఎస్ కిట్లు.. వాటి వలన కలిగే ప్రయోజనాలు, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సర్వే తదితర విషయాలపై చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొత్తవలస వ్యవసాయ శాఖ ఎడి ఎల్.విజయ, ఏఓ మాధురి శరణ్య, ఏపిఎం వై.ఉమామహేశ్వరరావు, ఎఫ్పిఓ ఏపీఎం వెంకటరమణ, పిఈ కేటి కృష్ణ ప్రసాద్, ఎన్ఎఫ్ఏ ఐసీటి సిహెచ్.వరప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్, వ్యవసాయ సిబ్బంది, సీసీలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

రియల్ వ్యాపారులకో న్యాయం.. రైతులకో న్యాయమా..!

భోగాపురం ఎయిర్‌పోర్టు రహదారి సర్వీస్ రోడ్ విషయంలో అధికారుల తీరు

లేఅవుట్‌లకు రహదారి సౌకర్యం.. రైతులకు మాత్రం అభ్యంతరం

విశాలాంధ్ర - విజయనగరం : భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంలో అడుగడుగునా రైతులు దగా పడుతునే ఉన్నారు. భూసేకరణ నరుంచి నేడు రహదారి నిర్మాణం వరకు రైతులకు తగిన న్యాయం జరగడం లేదని వారంతా వాపోతున్నారు. తాజాగా ఎయిర్‌పోర్టుకు వేస్తున్న అప్రోచ్ రోడ్ 5 గ్రామాల పరిదిలో వెళ్తోంది. గూడుపువలస, సవరవిల్లి, దల్లిపేట, బైరెడ్డిపాలెం, ఎ.రావివలస గ్రామాలలోని భూములను భూసేకరణలో తీసుకున్నారు. ఈప్రాంత అభివృద్ధి కోసం రైతులు తమకు తాముగానే భూసేకరణకు సహకరించారు. అయితే రహదారి పక్కన యానిమల్ ఫెన్సింగ్ వస్తుం డడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసారు. ఈ నేపధ్యంలో ప్రధానరహదారికి ఆనుకుని సర్వీస్ రోడ్‌లు వస్తాయని చెప్పడంతో తమ వ్యవసాయ భూములకు వెళ్ళేందుకు అవకాశం ఇస్తారని రైతులు సంతోషించారు. కానీ ప్రస్తుతం సర్వీస్ రోడ్ వేయకపోవడంతోపాటు ఎటువంటి అవకాశం రైతులకు ఇవ్వకపోవడంతో వారంతా ఆవేదన చెందారు. ఈనేపధ్యంలో ఇదే ప్రధానరహదారికి ఆనుకుని ఉన్న మూడు భారీ లేఅవుట్‌లకు విఎంఆర్‌డిఎ అప్రోచ్ రోడ్‌నుంచి రాకపోకలకు అవకాశం కలిగేలా అనుమతులు ఇవ్వడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు విన్నవించిన 5గ్రామాల రైతులు..

తమ ఆవేదనను 5 గ్రామాల నుంచి భారీగా కలెక్టరేట్‌కు తరలివచ్చిన రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. సర్వీస్ రోడ్ ద్వారా భూములు ఇచ్చిన రైతులకు రాకపోకలకు అవకాశమివ్వాలని కోరారు. అదే క్రమంలో లేఅవుట్‌లకు ఇచ్చిన అనుమతుల విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా స్థానిక మండల నాయకుడు శివారెడ్డి మాట్లాడుతూ భూసేకరణకు సహకరించిన రైతుల పట్ల ఇంత దారుణంగా వ్యవహరించడం అధికారులకు తగదన్నారు. సర్వీస్ రోడ్‌నుండి రాకపోకలకు రైతులకు అవకాశం కల్పించాలన్నారు. ఈవిషయమై కలెక్టర్‌కు వివరించామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో ప్రవేశ దరఖాస్తుకు గడువు పెంపు

విశాలాంధ్ర - నెల్లిమర్ల : మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవే శాలతో పాటు 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల కోసం ఈ నెల 25వ తేదీలోగా విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కన్వీనర్ పిలుపునిచ్చారు.

అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వ తక్షణ సహాయం అందజేత

విశాలాంధ్ర - జామి : మండల కేంద్రమైన జామిలోని రంభవీదిలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్ళు దగ్గమైన విషయం తెలిసిందే. బాధితులకు రెవెన్యూ పరంగా తక్షణ సహాయంగా 5కిలోల చొప్పున బియ్యం, దుస్తులు, వంట సామాగ్రిని ఆర్ఐ సృజన, విఆర్‌వోలు అరుణకుమారి, శ్రీనివాస్ చేతుల మీదుగా సోమవారం అందజేసారు. ప్రభుత్వ పరంగా బాధితులను ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు.

పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర - మెరకముడిదాం : మెరకముడిదాం మండలంలో సోమవారం నాడు పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు జరిగిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ మూడు పరీక్షా కేంద్రాల్లో సుమారు 633 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అయ్యారు. పరీక్ష 9:30 నిమిషాలుకు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ విద్యార్థులు మాత్రం 9 గంటలుకే పరీక్షా కేంద్రానికి చేరుకొని వారి వారి హాల్ టిక్కెట్లు నెంబర్ ప్రకారం ఏ రూమ్ అన్నది చూసుకోవటం జరిగింది. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనులు జరుగకుండా ముందు జాగ్రత్తగా బుధరాయవలస ఎస్ఐ జె లోకేష్ కుమార్ ఇద్దరు మహిళా పోలీసులు, ఒక మగ పోలీస్ తో 144 సెక్షన్ ఏర్పాటు చేశారు.పరీక్ష ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు జరిగింది.విద్యార్థులుకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా విద్యా శాఖ త్రాగునీరు, మరుగుదొడ్లు, ప్రధమ చికిత్స సౌకర్యం ఏర్పాటు చేశారు. ఏది ఏమైనా మొదట రోజు మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

కొట్టాం సీహెచ్‌వోగా నారాయణరావు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - జామి : మడంలంలోని అలమండ ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో ఎంపిహెచ్‌వోగా పని చేస్తున్న పి. నారాయణరావుకు సిహెచ్‌వోగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఆయన ఎస్‌కోట మండలంలోని కొట్టాం పిహెచ్‌సిలో సిహెచ్‌వోగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చాలాకాలంగా అలమండ పిహెచ్‌సిలో పనిచేస్తూ స్థానిక ప్రజలకు ఎంతో సేవ చేసిన ఆయనకు పదోన్నతి రావడం పట్ల ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు సంతోషం వ్యక్తం చేసారు.

కార్యకర్తలకు, ప్రజలకు భరోసాగా ఉంటాం

టీడీపీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు భరోసాగా ఉంటూ.. వారికి ఏ సమస్య వచ్చినా అండగా నిలుస్తామని విజయ నగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు వివిధ సమస్యలను వినతుల రూపంలో నాగార్జున దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ పార్టీ కార్యాలయంలో ఇకపై క్రమం తప్పకుండా ప్రజాదర్బార్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలనూ వినతుల రూపంలో స్వీకరించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంతో నమ్మకంతో ప్రజలు కూటమికి ఓట్లేసి గెలిపించారని.. దానిని నిలబెట్టుకుంటామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏ ఒక్కరూ ఇబ్బందులు పడకుండా ఉండాలన్నదే తమ అభిమతమని వివరించారు. అనంతరం ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతుల్లో అధికారుల పరంగా పరిష్కరించాల్సిన వాటిని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలసి.. వాటిని పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో పార్టీ ప్రధాన కార్యదర్శి రాజు, టీడీపి నేతలు అకిరి ప్రసాదరావు,గేదెల రాజారావు, ప్రసాదుల ప్రసాద్, అల్తి బంగారు బాబు, పతివాడ అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

విశాలాంధ్ర - లక్కవరపుకోట : ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల సమైక్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో గల మండల సమాఖ్య కార్యాలయము నందు వివో ఏలకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమము గ్రామ స్థాయిలో ఉన్న స్వయం సహాయక సంఘాలు సభ్యులందరినీ ప్రకృతి వ్యవసాయంలో మార్చడానికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని అదేవిధంగా వ్యక్తిగత వివరాల సేకరణ భూమి వివరాల సేకరణలో మీరు కీలక పాత్ర వహించాలని దిశ నిర్దేశం చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం పైన తొమ్మిది సార్వత్రిక సూత్రాల పైన సభ్యులకు గ్రామస్థాయి గ్రామ సమైక్య ప్రెసిడెంట్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏపిఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జి సభ్యులు అదేవిధంగా పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేయాలని వారి కుటుంబాలకు అవసరమైన ఉత్పత్తులను మార్కెటింగ్ నుండి కొనడం కాకుండా వ్యవసాయం ద్వారా పొందాలని పెంచుకునే కాయగూరలు వారి సొంత వినియోగానికి వినియోగించుకోగా మిగిలిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలని సభ్యులు అందరికీ తెలియజేయడం జరిగిందని అన్నారు. మండల స్థాయిలో ఉన్నటువంటి అన్ని శాఖల ఉద్యోగులు కలుపుకొని సమన్వయంతో ప్రకృతి వ్యవసాయానికి ముందు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయి అధికారి కృష్ణ ప్రసాద్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల సమైక్య సిబ్బంది పాల్గొనడం జరిగిందని తెలిపారు.

సేంద్రీయ ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం..

విశాలాంధ్ర - చీపురుపల్లి : సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను వాడకం ద్వారా ప్రతి ఒక్కరికి మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. సోమవారం నాడు చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం వారు ప్రకృతి సేంద్రియ ఎరువులతో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు నిమిత్తం స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వ్యవసాయం ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన పర్యావరణానికి అనుకూలమైన జీవనాధారిక వ్యవసాయంగా సేంద్రియ వ్యవసాయాన్ని అభివర్ణించవచ్చున్నారు. సేంద్రియ వ్యవసాయం జీవుల వైవిధ్యాన్ని మెరుగుపరుస్తుంది అన్నారు. ప్రాంతీయంగా లభించే వనరులను ఉపయోగించుకొని సేంద్రీయ వ్యవసాయాన్ని చేయడం ద్వారా రసాయనిక ఎరువులు పురుగుల మందులను దూరం పెట్టవచ్చునని ఆయన అన్నారు. సేంద్రియ ఎరువులతో పండించే కూరగాయలు తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అలజంగి గ్రామ సర్పంచ్ రఘుమండ త్రినాథ, కోరుకొండ దాలయ్య, సతీష్, ప్రభాత్ కుమార్, సూర్యనారాయణ, కర్రోతు ప్రసాద్, గవిడి సురేష్, డబ్బాడ ఆనంద్, వెంకీ, నాగచైతన్య తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డులో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పర్యటన

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం లో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పలు ప్రాంతాల్లో మున్సిపల్ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శానిటరీ ఇన్స్పెక్టర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డ్ శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో అన్న క్యాంటీన్, ఆర్టీసీ కాంప్లెక్స్, రాజా కాలేజీ రోడ్డు ఏరి యాలలో సోమవారం పర్యటించారు. అన్న క్యాంటీన్ లో అల్పాహారం పరిశీలించి రుచి మరియు నాణ్యత ఏ విధంగా ఉన్నది అక్కడ తింటున్న ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే. రంగారావు (బేబి నాయన) దృష్టిలో ఉన్న ఫిర్యాదును పురస్కరించుకుని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించి సంబంధిత డిపో మేనేజర్ వారితో మాట్లాడి తగు చర్యలు తీసుకోవలసినదిగా తెలియజేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వచ్చే అవుట్లెట్లను త్వరితగతిన క్లియర్ చేయాల్సిందిగా శానిటరీ ఇన్స్పెక్టర్ వారికి ఆదేశించారు. రాజా కాలేజీ ఏరియాలో రోడ్ల పైన చెత్తలు వేయకుండా చూడాలని, లిట్టరింగ్ తొలగించాలని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ వారికి ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో చెత్తలు వేయకుండా చూడాలని ఆదేశించారు.

నగర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం : నగర మేయర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం : నగర అభివృద్ధే ధ్యేయంగా సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 80 అంశాలను చర్చించిన అనంతరం మూడు అంశాలను వాయిదా వేయగా, మిగిలిన అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఆదాయ వనరులను పెంచుకొని నగర అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు గూర్చి అందరి సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అధికారులు పటిష్ఠ కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. దోమల నిరోధానికి లార్వా దశలోని నశింపజేసేందుకు అవసరమైన ఫాగింగ్ యంత్రాలు, స్ప్రేయింగ్ మరమ్మత్తులు చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కె.అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, సుంకరి నారాయణ స్వామి, రేగాన రూపాదేవి, జీవి రంగారావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆదరణ పథకంపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు బిసి సంఘం నాయకులతో కుల సంఘం అధ్యక్షులు ప్రజలతో సమీక్ష సమావేశం బీసీ కార్పొరేషన్ ఆఫీసులో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈడి పెంటోజీరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ఆదరణ పథకం ముఖ్య ఉద్దేశాలు బీసీ సంఘం నాయకులకు కుల సంఘం అధ్యక్షులకు ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. పేదరిక నిర్మూలనకు జీవితాలు బాగు చేసుకోవడానికి వృత్తిలను కాపాడుకోవడానికి ప్రభుత్వం చేపడుతున్న ఆదరణ పథకం ఎంతో ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలో వివిధ కుల సంఘాలు వృత్తులు కు కావలసిన పరికరాలు వివరాలు సమీక్షించి ప్రభుత్వానికి తెలియజేయడం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దిమిలి పైడ్రాజు, కార్యదర్శి శ్రీను, బీసీ సంఘం నాయకులు వివిధ కుల సంఘం ప్రజలు పాల్గొన్నారు.

పది పరీక్షలకు నలుగురు గైర్హాజరు

విశాలాంధ్ర - రామభద్రపురం : స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ లో మొదటిరోజు నిర్వహించిన పది పరీక్షలకు నలుగురు విద్యార్థులు హాజరు కాలేదని మండల విద్యాశాఖ అధికారి తిరుమల ప్రసాదరావు తెలిపారు. మొత్తం 541 మంది విద్యార్థులకు గాను 537 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గ్లోబల్ స్కూల్లో 241 మంది కి238 విద్యార్థులు హాజరయ్యారు అన్నారు. రామభద్రపురం జిల్లా పరిషత్ హై స్కూల్లో 270 మంది విద్యార్థులకు 269 హాజరయ్యారని తెలిపారు. మొదటిరోజు 10 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అన్నారు. అలాగే పరీక్ష కేంద్రాన్ని బొబ్బిలి ఆర్డీవో మోహనరావు స్థానిక తాసిల్దార్ సులోచన, ఎంఈఓ పెంటయ్య తిరుమల ప్రసాదాలు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే పరీక్ష కేంద్రం వద్ద మంచినీరు, వైద్యము వంటి సదుపాయాలు కల్పించారు.

గ్రీవెన్స్ వినతులకు తెలుగులోనే సమాధానం ఇవ్వాలి

పది పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి
అధికారులకు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రజా వినతుల పరిష్కార వేదికలో వివిధ వర్గాలు ఇచ్చే వినతులను పరిష్కరించిన అనంతరం తెలుగులో వారికి అర్థమయ్యే రీతిలో సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చిన ప్రతి వినతిని పరిష్కరించిన తర్వాత ఆయా వినతులు అందించిన వారితో మాట్లాడి వారు ఇచ్చిన వినతులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంతమేరకు పరిష్కరించడం సాధ్యమవుతుందో వివరించాలన్నారు. ఆ సమాధానంతో వారు సంతృప్తి చెందనట్లయితే ఆయా వినతులను మళ్లీ తెరచి పునఃపరిష్కరించే ప్రయత్నం చేయాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, ఇన్ ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎస్.శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు ప్రమీలాగాంధీ, మురళి, నూకరాజు తదితరులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రతి జిల్లా అధికారి వారంలో ఒకరోజు తమ మండల, డివిజన్ స్థాయి అధికారులతో తమ శాఖకు సంబంధించిన వినతుల పరిష్కారంపై సమీక్షించాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వారి కార్యాలయాల నుంచి వచ్చే వినతులపై విచారణకోసం మండలస్థాయి అధికారులు పిటిషనర్ల వద్దకు వెళ్లి మాట్లాడేలా చర్యలు చేపట్టాలన్నారు.

భోగాపురం మండలంలో ఎయిర్ పోర్టు ఎప్రోచ్ రోడ్డు కోసం సేకరించిన భూమికి ఇరువైపులా నిర్మాణ సంస్థ ఫెన్సింగ్ వేయడంతో సమీప గ్రామాల్లో వ్యవసాయ భూములకు వెళ్లేందుకు మార్గంలేక ఇబ్బందులు పడుతున్నట్టు ఎయిర్ పోర్టు నిర్వాసిత గ్రామాలైన గూడెపువలస, సవరవిల్లి, దల్లిపేట, బైరెడ్డిపాలెం, ఏ.రావివలస తదితర ఐదు గ్రామాలకు చెందిన ప్రజలు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్‌కు విన్నించారు. ఎప్రోచ్ రోడ్డుకోసం సేకరించిన భూమిలో సర్వీసు రోడ్ల నిర్మిస్తే తమకు ఇబ్బందులు తప్పుతాయని వారు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆర్.డి.ఓ. కీర్తితో ఆన్ లైన్ వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి యా గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజల సమస్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పదోతరగతి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి

జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మండలాల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. ఆయా మండలాల్లోని పరీక్ష కేంద్రాల్లో కల్పిస్తున్న వసతులపై ఆర్.డి.ఓ., తహశీల్దార్, ప్రత్యేక అధికారులు తనిఖీలు చేయాలన్నారు. ఆర్టీసీ ద్వారా పరీక్ష కేంద్రాలకు సులువుగా చేరుకునేందుకు వీలుగా అవసరమైన బస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

25,26 తేదీల్లో కలెక్టర్ల సదస్సుకు శాఖల వారీ నివేదికలు ఇవ్వాలి

రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో ఈనెల 25, 26 తేదీల్లో కలెక్టర్‌ల సదస్సు జరుగుతుందని సమాచారం అందిందని, ఈ సమావేశానికి అవసరమైన నివేదికలను అన్ని ప్రభుత్వ శాఖలు అందించాలని చెప్పారు.

గ్రీవెన్స్‌కు 213 వినతులు

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికకు 213 వినతులు అందాయి. అధికంగా రెవిన్యూ శాఖకు 148, మునిసిపల్ శాఖకు 20, డి.ఆర్.డి.ఏ.కు 11, జిల్లా పంచాయతీ శాఖకు 15, విద్యుత్ పంపిణీ సంస్థకు 5, గృహనిర్మాణ సంస్థ, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 4, వైద్య ఆరోగ్యశాఖ, పాఠశాల విద్యాశాఖకు 2 వంతున వినతులు అందాయి.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - దత్తిరాజేరు : కోరపుకొత్త వలన ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో శంకర్ ఫౌండేషన్ విశాఖపట్నం మరియు డాక్టర్ పి.స్రవంతి వైద్యాధికారి ఆధ్వర్యంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించ బడుతుందని దీన్ని అందరూ సద్విని యోగంచేసుకోవాలని తెలియజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి, శుక్లం ఆపరేషన్‌కు ఎంపికైన నిరుపేద లకు డాక్టర్ సలహా మేరకు కాటారక్ట్ శాస్త్ర చికిత్స (లెన్స్) అమర్చి ఉచితంగా ఆపరేషన్ చేయబడునని, కంటిమీద కండ, మెల్లకన్ను సరి చేయుట మరియు కంటి శుక్లాలు ఉన్న పెద్దలకు, పిల్లలకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేయబడునని అన్నారు. డాక్టర్ సిఫారసు మేరకు ఎవరైనా కంటి సమస్యలుకు ఆపరేషన్ చేయాల్సి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు మరియు ఒక జత బట్టలు తో ఆపరేషన్‌కు రావాలని కోరారు. ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు.

కార్పొరేషన్ గ్రీవెన్స్‌కు ఒకటే వినతి

విశాలాంధ్ర - విజయనగరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం ఒక వినతి మాత్రమే వచ్చింది. విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కమిషనర్ పల్లి నల్లనయ్య హాజరై ప్రజల నుండి వినతులను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఒకటి వినతి వచ్చింది. వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకోవడంతో ప్రతి ఒక్కరు ఆస్తి, ఖాళీ స్థలములు పన్నులు, కుళాయి చార్జీలు, డిఎన్డ్ఓ ట్రేడ్ లైసెన్సులను తక్షణమే చెల్లించాలని ప్రజలకు సూచించారు. నగరాభివృద్ధికి ప్రజలు చెల్లించిన పన్నులే ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు నిప్పు పెట్టిన దుండగులు.. రూ. లక్ష ఆస్థి నష్టం

విశాలాంధ్ర - చీపురుపల్లి : గుర్తు తెలియని దుండగులు చీపురుపల్లి పట్టణ శివారులో గల రామాంజనేయ కాలనీ ప్రాథమిక పాఠశాలకు నిప్పు అంటించడంతో పాఠశాల భవనంలోని గదులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి సోమవారం అధికారులు అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి చీపురుపల్లి పట్టణ శివార్లలో గల ఇంటిగ్రేటెడ్ వసతి గృహానికి సమీపంలో గల రామాంజనేయ కాలనీ ప్రాథమిక పాఠశాల భవనంలో పాఠశాల గది తలుపులను బద్దలు కొట్టి గుర్తుతెలియని దుండగులు పాఠశాల భవనంలో నిప్పు రాజేశారు. ఈ ప్రమాదంలో పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులతో పాటు లైబ్రరీ పుస్తకాలు బీరువాలు ఫ్యాన్లు అగ్నికి ఆహుతయ్యాయి, అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకం కోసం నిల్వ చేసిన నిత్యవసర వస్తువులు కూడా అగ్నికి ఆహుతి అయినట్లు అధికారులు పరిశీలి స్తున్నారు. స్థానికంగా గమనించిన ఆనవాళ్లను బట్టి ఆకతాయి కొంతమంది మద్యం సేవించి స్కూలు తలుపులు బద్దలు కొట్టి అగ్ని ప్రమాదాన్ని జరిపినట్లు తెలుస్తుంది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీస్ శాఖ నుండి డిఎస్పి రాఘవులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శంకర్రావు, గరివిడి ఎస్ఐ లోకేష్ లు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌ని కూడా రంగంలోకి దింపి దుండగుల కోసం పోలీసులు వెతుకులాట ప్రారంభించారు. ఈ మేరకు గరివిడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా త్రిపురమాంబ తీర్థ మహోత్సవం

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు చిన దుంగాడ,పెద్ద దుంగాడ గ్రామాల ఆరాధ్య దేవత శ్రీశ్రీశ్రీ త్రిపురమాంబ తీర్థ మహోత్సవం సోమవారం వైభవంగా గ్రామ పెద్దలు నిర్వహించారు.తీర్థ మహోత్స వాన్ని పురస్కరించుకొని వేకువ జాము నుండి అమ్మవారికి ధూప,దీప నైవేద్యములు సమర్పించడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు.అనంతరం కళ్ళు మిరీమిట్లు గొలిపే విధంగా భారీ లైటింగ్లతో మందు గుండు సామగ్రి పేల్చారు.అలాగే మధ్యాహ్నాము 12గంటల నుండి అమ్మవారి సన్నిధిలో విశాఖ వాస్తవ్యులు లంక శ్రీనివాసరావు,విజయలక్ష్మి దంపతుల ఆర్థిక సహాయంతో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయగా చుట్టుపక్కల గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాలను స్వీకరించి ఆమె కృపకుపాత్రులైనారు. సాయంత్రం 4గంటల నుండి ఎడ్ల పరుగు ప్రదర్శన దాతల సహకారంతో నిర్వహించగా ఎడ్ల పరుగు పందెంలో 9ఎడ్ల బండ్లు పాల్గొనగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రామ పెద్దలు నగదు బహుమతులను అందజేశారు. అనంతరం రాత్రి 9గంటల నుండి శ్రీ మహేశ్వరి బృందం ఆనందపురం వారిచే బుర్రకథ కార్యక్రమం యువతను ఆకట్టుకుంది.ఈ తీర్థ మహోత్సవంను చుట్టుపక్కల గ్రామ ప్రజలు విజయవంతం చేసినందుకు గ్రామ పెద్దలు కమిటీ యూత్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ పార్టీలతో ఆర్డీఓ సమావేశం

విశాలాంధ్ర - చీపురుపల్లి : చీపురుపల్లి నియోజక వర్గ పరిధిలోగల అన్ని రాజకీయ పార్టీ నాయకులతో చీపురుపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిని జి సత్యవాణి సోమవారం నాడు తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, ప్రధాన ఎన్నికల అధికారి, ఆంధ్రప్రదేశ్ మరియు కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయనగరం వారి ఆదేశాల మేరకు ప్రతినెల మొదటి వారంలో అన్ని రాజకీయ పార్టీలు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులుతో నియోజవర్గంలో ఓటర్లు నమోదు, సవరణలు, తొలగింపు, మైగ్రేషన్ ఓటర్ల సవరణలు వంటి పలు కీలకమైన అంశాల పైన ఆమె చర్చించారు. ప్రభుత్వ అధికారులతో పాటుగా రాజకీయ నాయకుల సహకారం కూడా ఎంతో అవసరమని ఆమె అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటర్ గా నమోదు చేసుకోవచ్చని సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్ ని కలిసి సంబంధిత వివరాలు నమోదు చేసుకొని ఓటర్ గుర్తింపు కార్డును పొందవచ్చు అని ఆమె సూచించారు.ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ ఉమ్మడి విజయనగరం జిల్లా కో-ఆర్డినేటర్ కోట్ల కృష్ణ, చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గవిడి నాగరాజు వైయస్సార్సీపి నాయకులు కోరుకొండ దాలయ్యతో పాటు డిప్యూటీ తాసిల్దార్ (ఎలక్షన్స్) ఎం.హర్షవర్ధిని మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్. ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

గంజాయితో ఐదుగురు అరెస్ట్
కేజీ 200 గ్రాముల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - గుర్ల : గంజాయిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై వి. నారాయణరావు తెలిపారు మండలంలోని సొలిపిసోమరాజుపేట సంపావతి నది పరివాహ ప్రాంతంలో గంజాయిని తరలిస్తున్న ఐదుగురును గుర్ల పోలీసులు సోమవారం పట్టుకొని అరెస్ట్ చేశారు. గుర్ల మండలంలోని సొలిపిసోమరాజుపేటకు చెందిన ఇద్దరు, ధమరసింగికు చెందిన ఒక్కరు, నెల్లిమర్లకు చెందిన ఒకరిని, జామి మండలం అలమండకు చెందిన ఒకరిని పట్టుకొని అరెస్ట్ చేశారు. వారు వద్ద నుంచి ద్విచక్ర వాహనం , ఐదు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

వేరువేరు చోట్ల అగ్ని ప్రమాదాలు
కాలి బూడిదయిన రెండు మిద్దె ఇల్లులు ఒక పురిళ్లు
ఆరు లక్షలకు పైగా ఆస్తి నష్టం

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని వేరు వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు జరగడంతో ఆరు లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లడంతో సర్వం కోల్పోయామని అగ్ని ప్రమాద బాధితులు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని రాయుడుపేట గ్రామంలో ఆదివారం రాత్రి 11గంటల సమయంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన బెహరా పరదేశి, బెహరా రాము,బెహరా అప్పారావుల తాటి ఆకు మిద్దెల్లులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి.ఈ ప్రమాదం వలన బాధితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని బోరునవిలపిస్తున్నారు.ప్రమాదం ఎలా సంభవించిందో తెలియద ని రాత్రి 11గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించడం వలన నిద్రమత్తులో ఉండడం వలన ఆస్తి నష్టం జరిగిందని వాపోతున్నారు.ఈ ప్రమాదంలో సుమారు 6లక్షల ఆస్తి నష్టం జరిగిందని స్థానికులు అంచనా వేస్తున్నారు.ప్రమాద విషయాన్ని తెలుసుకున్న గ్రామ రెవెన్యూ అధికారి గ్రామానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించి నివేదికను తహశీల్దార్ కి అందించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన గ్రామ సర్పంచు సేనాపతి లీల అప్పారావు దంపతులు బాధితులకు కిరాణా సరుకులు అందించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు. అలాగే మండలంలోని కొండ గంగుబూడి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో అగ్ని ప్రమాదం సంభవించడం వలన దుంబరి బుచ్చమ్మకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతి దగ్ధమైంది.దీంతో ఇంట్లో ఉన్న వస్తువులు,సామాగ్రి సర్వం కోల్పోయారు. ప్రభుత్వం ఆదుకొని పక్కా ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా 10వ తరగతి తెలుగు పరీక్ష
పరీక్ష రాసిన 411 మంది విద్యార్థులు

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాల్లో 10తరగతి విద్యార్థులు మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.వేపాడ జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 167 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా 167 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు.అలాగే విక్టరీ స్కూల్ లో 127 మంది విద్యార్థులకు గాను 127 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు.ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల పరీక్షా కేంద్రంలో 118 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయాల్సి ఉండగా 117 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు.ఈ 10వ తరగతి పరీక్షలలో 412 మంది విద్యార్థులకు గాను 411 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై ఒకరు హాజరు కాలేదని మండల విద్యాశాఖ అధికారి పి.బాల భాస్కరరావు తెలిపారు.ఏది ఏమైనా మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - తెర్లాం : కూనయవలస గ్రామంలో పేద బడుగు బలిహీన వర్గాల ఆశాజ్యోతి ప్రియతమ నాయకులు బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్ వి వి ఎస్ కే రంగారావు(బేబీ నాయన) మన దళిత జాతి ముద్దు బిడ్డా స్వాతంత్ర సమరయోధుడు 'సంఘసంస్కర్త' రాజకీయవేత్త అయినటువంటి బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహంకు అయ్యే మొత్తం ఖర్చు 55, 000 ఇవ్వడం జరిగింది. అని కూనాయవలస గ్రామ నాయకులు తెలిపారు.

గొల్ల పేరంటాలు
ఉండి ఆదాయం 2,78,000

విశాలాంధ్ర - చీపురుపల్లి : చీపురుపల్లి మండలం, మెట్టపల్లి గ్రామం నందు వేంచేసియున్న శ్రీ గొల్లపేరంటలు అమ్మవారి హుండీలను వార్షిక ఆదాయం 2,78,702 రూపాయలు లభించిందని ఆలయ శాఖ ఈవో బి శ్రీనివాసరావు సోమవారం నాడు విలేకరులకు తెలిపారు. ఈనెల 13 నుండి 16వ తేదీ వరకు మెట్టపల్లి గ్రామంలో వెలసిన శ్రీ గొల్ల పేరంటాలు అమ్మవారి జాతరను నిర్వహించడం జరిగిందన్నారు. జాతర అనంతరం గ్రూపు దేవాలయముల గజపతినగరం వారి సమక్షంలో ఉండిలను తెరిచి ఆదాయాన్ని లెక్కించడం జరిగిందన్నారు. కె. శ్రీరామ్, కార్యనిర్వహణాధికారి, గ్రూపు దేవాలయములు గజపతినగరం వారి సమక్షంలో నిర్వహించిన ఉండి లెక్కింపు కార్యక్రమంలో సీనియర్ నాయకులు బూటు.శ్రీను , వేంపడపు.రామ మూర్తి ,గ్రామ పెద్దలు మరియు సిబ్బంది తదితరులు పాల్గొనియున్నారు..

ప్రోటోకాల్ పాటించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వండి
కలెక్టర్‌ను కోరిన రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లు

విశాలాంధ్ర - విజయనగరం : తమకు రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పోస్టులు ఉన్నా స్థానికంగా మండలాలలో అధికారులు తగిన గౌరవం ఇవ్వడం లేదని ఇతర ప్రజాప్రతినిధుల వలె మాకు కూడా ప్రోటోకాల్ పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను జిల్లాలో ఉన్న రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లు కోరారు. సోమవారం జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్ లో డైరెక్టర్ అందరూ కలెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్ను కలిసి తమ వినతి పత్రాన్ని అందజేశారు. మా సొంత మండలాల్లో మండల స్థాయి సమావేశాలలో ప్రోటోకాల్ పాటించేలా చూడాలని వారంతా కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - గంట్యాడ : గంట్యాడ మండలం బురద పాడు గ్రామంలో చుక్కా రాంబాబు 39 సంవత్సరాలు ఈనెల 9వ తేదీన పొలం పనులు ముమ్మరంగా చేస్తుండగా పాము కాటేసింది వెంటనే మృతుని కుటుంబ సభ్యులు విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కానీ ఆరోగ్య పరిస్థితిలో ఏ రకమైన మార్పు రాని కారణంగా మరింత మెరుగైన వైద్యం కొరకు కేజీహెచ్ కు తరలించారు. అక్కడ కూడా మృతుని ఆరోగ్యము క్షీణించి మృతి చెందినట్లుగా వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంట్యాడ ఎస్సై సాయికృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాజకీయ పార్టీలు బిఎల్‌ఏలను నియమించాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం : ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీలు తమవంతు సహకారాన్ని అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. దీనికోసం బూత్ స్థాయిలో బిఎల్‌ఏలను నియమించాలని ఆయన పార్టీలకు సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తమ ఛాంబర్‌లో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలకు సంసిద్ధత అన్నది ప్రస్తుతం నిరంతర ప్రక్రియగా మారిందని చెప్పారు. దీనిలో భాగంగానే మార్పులు చేర్పులకోసం ధరఖాస్తులను ప్రతిరోజూ స్వీకరించడం జరుగుతోందని చెప్పారు. అలాగే ఇకనుంచీ ప్రతీనెలా రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో ఏమైనా లోటుపాట్లు గుర్తిస్తే, వాటిని ఎప్పటికప్పుడు సరిచేయడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. తప్పులు లేని ఖచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించడం, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలను కల్పించడం, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడం చాలా అవసరమని, దీనికోసం రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు ప్రతీ పోలింగ్ కేంద్రానికి పార్టీలు తమ ప్రతినిధులుగా బిఎల్‌ఏలు నియమించుకోవాలని సూచించారు. ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, సమావేశ లక్ష్యాలను, పార్టీలు నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. టిడిపి నుంచి ఐవిపి రాజు, వైకాపా నుంచి వి.నర్సింహమూర్తి, కాంగ్రెస్ నుంచి ఎస్.సతీష్‌కుమార్, బిజెపి నుంచి ఎం.అప్పలసూరి, జనసేన నుంచి శ్రీనివాస్, బిఎస్‌పి నుంచి కె.సోములు తదితర ప్రతినిధులు, ఎలక్షన్ సూపరింటిండెంట్ భాస్కరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని, రాష్ట్రపతి చిత్ర పటాలు పెట్టాలి
నియోజక వర్గ కన్వీనర్ బూర్లి శ్రీధర్, మండల అధ్యక్షులు మైపాడ ప్రసాద్

విశాలాంధ్ర - నెల్లిమర్ల : ప్రధాని మంత్రి నరేంద్రమోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిత్ర పటాలను ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని బిజెపి నియోజక వర్గ కన్వీనర్ బూర్లి శ్రీధర్, అన్నారు. సోమవారం మండల అధ్యక్షులు మైపాడ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రాజేష్ వర్మ ఆదేశాల మేరకు మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని, రాష్ట్రపతి చిత్ర పటాలు పెట్టాలని అధికారులకు తెలిపామన్నారు. సంక్షేమ కార్యక్రమాల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిధులు మిళితమై ఉన్నాయని అందుకు అనుగుణంగా ప్రధాని, రాష్ట్రపతి చిత్ర పటాలు పెట్టాలని కోరారు. అనంతరం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు ప్రధాని, రాష్ట్రపతి చిత్ర పటాలతో పాటు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చందక గోవిందరావు, పార్టీ సీనియర్ నాయకుడు నడిపేన నారాయణమూర్తి, సురాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

వివిధ రాజకీయ పార్టీలు నేతలతో ఆర్డీవో రామ్మోహన్‌రావు

విశాలాంధ్ర - బొబ్బిలి : నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి , రెవిన్యూ డివిజన్ అధికారి రామ్మోహన్‌రావు అధ్యక్షతన రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఓటర్ల నమోదు ప్రక్రియ, తొలగింపు ప్రక్రియ, మరియు బదిలీలు మార్పులు ప్రక్రియ నిరంతర ప్రక్రియగా జరుపబడునని తెలిపారు ఓటర్ల జాబితాలో ఏమైనా సవరణలు మార్పులు చేర్పులు అవసరమైనచో సంబంధిత బూత్ స్థాయి అధికారులు కలిసి ఫారం 6, 7, 8 క్లెయిమ్స్ ద్వారా దరఖాస్తు చేసుకున్నచో వారి వారి అర్హతను బట్టి, విచారణ నిర్వహించి అర్హులైనచో తదుపరి చర్యలు చేపట్టి జాబితాలో మార్పులు చేర్పులు జరపబడునని ప్రతి పోలింగ్ కేంద్రమునకు బూత్ స్థాయి ఏజెంట్ లను నియామకం చేసుకోవాలని అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో అస్యూర్డ్ మినిమం ఫెసిలిటీస్ కల్పించబడినవని తెలిపారు. రాజకీయ పక్షాలు ప్రతినిధులతో ప్రతి నెల మొదటి వారంలో నిర్వహించబడునని తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ బలివాడ గౌరీశంకర్రావు పాల్గొన్నారు.

మల్బరీ మొక్క, పట్టు పరిశ్రమ షెడ్‌ను ఎంపీడీవో పరిశీలన

విశాలాంధ్ర - మెరకముడిదాం : మండలంలో ఉత్తరావల్లి పంచాయతీ పరిధిలో రైతు రాధ సూర్య నారాయణకి మంజూరు అయిన సెరీకల్చర్ (పట్టు పరిశ్రమ) షెడ్ మరియు మల్బరీ మొక్కలను ఎంపీడీవో పరిశీలించడం జరిగింది. దీంతో పాటుగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సామాజిక పనులతో పాటు వ్యవసాయ సంబంధ పనులు ఫారం పాండ్స్, తోటగట్లు, బౌండరీ ట్రెంచ్, ఇంకుడు గుంతలు మొదలైన పనులను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల ప్రయోజనం పొందవలసిందిగా కోరడమైనది. వ్యక్తిగత పనుల గుర్తింపు మరియు నిర్వహణ పై సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి ఏపివో నరేంద్ర కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.